వారం వారం కథా ప్రభ

# యోగం

ఆదూరి వెంకట సీతారామమూర్తి

"ఓంకార బిన్దు సంయుక్తం
నిత్యం ధ్యాయన్తి యోగినః
కామదం మోక్షదం చైవ
తస్మాదోంకారాయ నమోనమః"

మాఘమాసపు తెలిమంచు తెరలు నెమ్మది నెమ్మదిగా జారిపోతూన్న ఆ ఉషోదయాన శ్రీ సాయి ప్రార్ధనా మందిరం మూడో అంతస్తు డాబా మీద యోగ విద్యను నేర్పే అధ్యాపకుడు, సుమారు డజను మంది యోగ విద్యార్థులు - కలిసి ప్రార్ధనా గీతాన్ని ఆలపిస్తున్నారు.

మెట్ల దిగువన 'సన్నీ' ఆపి, గబగబా మెట్లెక్కింది వింధ్య.

"ఓం సహనావతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీత మస్తు, మా విద్విషావహై ఓం శాంతిః శాంతిః శాంతిః" ప్రార్ధన పూర్తయింది. నిశ్చలంగా నిర్మలంగా కళ్లు మూసుకుని కూర్చుని... ఎవరికివారే మెడిటేషన్‌లో - తెల్లని కుర్తా పైజామాల్లో మగవారూ, ఆకాశనీలం చుడీదార్లలో ఆడవారూ చూడముచ్చటగా ఉందా దృశ్యం.

కార్పెట్ మీంచి పిల్లిలా నెమ్మదిగా నడిచొచ్చి చివరి నుండి రెండో వరసలో నున్న రెండో స్థానంలో కూర్చొని కళ్లు మూసుకుంది. మెట్లెక్కి వచ్చిన ఆయాసం... స్థిమితపడ్డానికి మరో రెండు నిముషాలు పట్టింది. మనసులో ఏవేవో ఆలోచనలు... ధ్యానం మీదకు మనసు లగ్నం కావడం లేదు.

నెమ్మదిగా కళ్లు విప్పింది. ఎదురుగా ఆదిత్య యోగసాధనతో తేజోవంతమైన ముఖం... నిండా నలభై ఏళ్లుండవ్. ఎర్ర జాంపండు వంటి వర్చస్సు... ఆసనాలతో పరిపక్వత చెందిన శరీరం..... క్రమశిక్షణతో చురుకెక్కిన చూపూ....

"దీనికా యోగం లేదేమో!" బామ్మమాటలు గుర్తుకొచ్చాయి. పిచ్చి బామ్మ! పెళ్లి, సంసారం... పిల్లలూ.... ఇవేనా స్త్రీకి కావల్సినవి?

"ప్లీజ్ స్టాండప్" శిక్షణ మొదలైంది.

హేండ్స్ రొటేషన్.... హెడ్ రొటేషన్... తాడాసనం- కటిచక్రాసనం. ఒకదాని తర్వాత ఒకటి- శరీరం వేడెక్కి స్వాధీనంలోకి రావడానికి చేసే క్రియలూ, ఆసనాలూ తను చేస్తూ చేయిస్తున్నాడు ఆదిత్య.

ఆసనానికీ ఆసనానికీ మధ్య చిన్న విశ్రాంతి. ఆ విశ్రాంతి వేళలోనే శరీరం, మనసూ కూడా రిలాక్సవ్వాలిట-

ఆకాశం వంక చూసింది వింధ్య-

ఉదయపు నీలాకాశం - అక్కడక్కడా దూదిపింజల్లా తేలిపోతూ తెల్లమబ్బు తునకలూ... బారులు బారులుగా స్వేచ్ఛగా ఎగిరే రకరకాల పక్షులూ, వాటి కిలకిలారావాలూ-



"మనస్సను జీవుడు హృదయాకాశాన ఉన్నాడని చెబుతారు. మరి... మనస్సనేది ఎన్ని రకాలుగా ఉంటుందో చెప్పగలరా వింధ్యా?"

సూటిగా వచ్చింది ప్రశ్న - కాస్త తడబడింది - ఆలస్యంగా వచ్చినందుకు శిక్షా ఈ ప్రశ్న? తన పేరెంత గుర్తో! అప్లికేషన్‌లో రాసినదాన్ని గుర్తు పెట్టుకున్నాడన్నమాట! అయినా ఇది యోగ శిక్షణా? క్లాసు రూమా? ఎవరిక్కావాలీ థియరీ?

సమాధానం రాకపోయేసరికి అతనే చెప్పాడు.

"జాగ్రత్ - స్వప్న - సుషుప్తి అనే మూడు అవస్థల్లో చరిస్తూ ఉంటుంది మనసు. అదెలా అంటే..."



"మనసుగతి ఇంతే..." పాట గుర్తొచ్చింది వింధ్యకి- తను చెప్పిన మాట వినకపోతే రేణుక పాడే పాట ఇదే. 'నామాట విన్న - ఎన్నో రోగాలకు యోగమే మందు. నీ గదికి దగ్గర కూడానూ, వెల్లి జాయినవ్వు-'

అదే తనవిక్కడికి తోసి చేతులు దులుపుకుంది.

'పోనీ నువ్వు కూడ రారాదుటే'

"బాగుంది. మా ఆయనకీ పిల్లలకీ ఎవరు సుప్రభాతం పాడతారు? నువ్వా?"

నోర్మూసుకుంది-

"ఇప్పుడు పాదహస్తాసనం" అంటూ ఎలా చేయాలో చేసి చూపించేడు ఆదిత్య. ఆ తర్వాత అందరూ అలాగే చేతులు ఇరుపక్కలకు చాచి; పైకెత్తి; నెమ్మదిగా క్రమంగా శరీరాన్ని ముందుకు వంచారు.

'తలనూ చేతుల్నీ రిలాక్స్‌డ్‌గా వదిలేసి కళ్లు మూసుకుని వెన్నెముక మీద మనసుని కేంద్రీకృతం చేయాలి' అంటూ ఒక్కొక్కరి దగ్గరకూ వచ్చి వారి భంగిమను సరిచేస్తున్నాడు.

"వింధ్యగారూ! మీరు మరికాస్త వంగాలి." అన్నాడు దగ్గరొచ్చి.

"దీనికి ఒళ్లు వంగదు- రేపెవడేనా తలకి మాసిన వాడు దొరికి సంసారంలో పడ్డా పని మాత్రం సున్నా" అనేది బామ్మ. తను ఇంటి పనికి డుమ్మా కొట్టినపుడల్లా.

ఆ తలమాసినవాడు ఇంతవరకూ దొరకలేదు.

చెబుతూన్న ఆసనాలు చెవికెక్కటం లేదు- చూనన్తా అనంకలింతంగా చేస్తోందేగాని ఆలోచనలు ఎక్కడెక్కడికో లాక్కెళుతున్నాయి.

గంట గడిచిపోయింది- చివరిగా హాయిగా వెల్లకిలా పది నిముషాలపాటు అచేతనంగా పడుకునే శవాసనం.

ఇది బాగుంది అన్నిటికంటే.

* * *

రాత్రి పదకొండు గంటలు దాటింది. నిద్రవచ్చే జాడలేదు.

"యోగా చేసేవారు రాత్రి త్వరగా నిద్రపోవాలి. చాలినంత మంచి నిద్ర, మంచి ఆహారపుటలవాట్లూ అవసరం."

ఆదిత్య మాటలు గుర్తుకొచ్చాయి వింధ్యకి.

సగం రాత్రి వరకూ ఏదో పుస్తకం చదవడం, అప్పుడప్పుడు టీవీలో ప్రోగ్రామ్స్ చూడటం... ఎప్పట్నించో ఉన్న అలవాట్లన్నీ ఒక్కమారు మారిపోవాలంటే ఎలా?

ఉదయం అయిదవకుండా లేవడం; కాలకృత్యాలయ్యాక స్నానం- అర నిమ్మపండు రసం, తేనె, గ్లాసుడు గోరువెచ్చని నీళ్లలో కలుపుకుని తాగడం.... ఇవీ కొత్తగా.

ఆరున్నరకి లేచి, వేడి వేడి కాఫీ తాగుతూ నల్లమందు లాంటి వార్తలూ విశేషాలు అందించే పేపర్ చదివే అలవాటు నెమ్మదిగా మారుతోంది- ఈ నాలుగు నెలలూ గడిపేస్తే మళ్లీ తన అలవాట్లలోకి తను జారుకుంటుందేమో!

"శరీరాన్ని మొదట ట్యూన్ చెయ్యాలి. ఆ తర్వాతనే ఆసనాలు, యోగం... అన్నీ - అలా ఆసి ట్యూన్ చేసి ఆపేస్తే ఉపయోగముండదు- యోగ సాధన నిత్యం ఉండాలి. అప్పుడే యోగా వల్ల మనకు పూర్తి ప్రయోజనాలు లభిస్తాయి."

ఆయనకేం? ఎన్నయినా చెబుతాడు. నలభై ఏళ్లు నిండకుండానే ఓ సిద్ధుడిలా బుద్ధిగా కబుర్లు!

సీత కష్టాలు సీతకున్నాయి!

ముప్పయ్ అయిదేళ్ళు దాటకుండానే ఒళ్లు పెరగడం... చీటికీ మాటికీ వెన్ను నొప్పి. వీపు నొప్పి-

ఇద్దరు పిల్లల తల్లయినా రేణుక ఎంత స్లిమ్‌గా ఉంటుందో! దాన్నీ దాని చలాకీతనాన్నీ చూస్తే అసూయ తనకి.

"నీకు పని తక్కువయ్యే అవన్నీనూ. నన్ను చూడు ఇంటా బయటా పనే పని. అదే నా ఆరోగ్య రహస్యం" అంటుంది.

కలకాలం హాయిగా ఆర్యోగంగా బతకాలని ఎవరికుండదు? కానీ కాకిలా ఏకాకిలా తను ఎన్నాళ్లు బతికితేనేం? తన ఒంటరి బతుక్కో గుదిబండలా ఓ పర్మనెంటు ఉద్యోగం! జీవితాధారాన్ని గుదిబండ అనుకుంటే పుట్టగతులుండవేమో! పదకొండున్నర అయినట్లు గంట వినిపించింది-

"చక్రాసనం... మీ వంటి వారికి చాలా మంచిది. ప్రయత్నించండి- అరి చేతులు సరిగ్గా తలప్రక్కనే పెట్టి కాళ్లపాదాల మీదా అరచేతుల మీదా బరువాన్ని శరీరాన్ని లేపాలి. కమాన్ ప్రయత్నించండి." అంటూ ఉదయం తన పక్కనే నిలబడ్డాడు ఆదిత్య.

తన శరీరమే బరువెక్కిపోయినట్టూ... తన మాట విననట్టూ... బతుకు భారంకన్నా ఆక్షణంలో శరీర భారమే ఎక్కువైనట్టూ- అరచేతుల్లోనూ నుదుటా పొట్టమీదా చెమటలు.

"మరి కాస్త ప్రయత్నిస్తే వచ్చేస్తుంది. నేను సపోర్టిస్తాను చూడండి" అంటూ తన నడుం కిందచెయ్యి ఆసరాగా అన్ని పైకెత్తేడు తన బలాన్ని కూడా ఉపయోగించి-

అనుకోని సంఘటన- తన శరీరాన్ని తాకిన మొదటి పురుషుడు. జలదరింపు లేకపోయినా ఏదో కొత్త అనుభూతి. అయినా అతనలా ఎందుకు తనకు సహకరించాలి?

వైద్యుడు, గురువు - వీరి గురించి మరోలా అనుకోకూడదు.

"మనసులో అటువంటి భావన ఉంటేనే ఎదుటి వారిని తప్పుపడుతుందేమో మనసు" అంటుంది రేణుక.

ఏడిసింది! ఆఫీసులో మగరాయుళ్లతో ఎంత సోషల్‌గానో మూవ్ అవుతుందది. దాన్ని పలకరించని వాళ్లుండరు. దాని ముందు తను రిజర్వుడుగా ఉన్నట్టే- స్వభావానికి తోడు గతమొకటి-

గతం తవ్వుకుంటే జీవితంలో పోగొట్టుకున్నవి బయల్పడతాయి!


ఆవులించి లైటార్పేసింది.

* * *

"ఎలా ఉందే క్లాసు?" అడిగింది రేణుక.

"నా బొందలా ఉంది" బాస్ మీది కోపం ఆక్షణాన రేణుక మీదకు విసుగై పెల్లుబికింది-

"నేనడిగింది బాస్ పెట్టిన క్లాస్ గురించి కాదు. యోగా గురించి"



### లెక్క

"అమ్మా! చూడు పక్కింటి రాజా నా పుస్తకం ఎలా చింపేశాడో"

"మళ్లీ పోట్లాడావన్నమాట. నీకు కోపం వస్తే ఎవరితోనయినా పోట్లాడేముందు పది అంకెలు లెక్కపెట్టమని నీకెన్ని సార్లు చెప్పాను."

"నిజమేనమ్మా. కానీ రాజా వాళ్లమ్మ అయిదు అంకెలే లెక్క పెట్టమని చెప్పిందట."

"ఆ!!"

**వి.వి. సీతారామ్‌దాస్** (గుంటూరు)

"కుర్ర మాష్టారు కదా. నచ్చేడు." అంది పెంకెగా- ఆమెకే విన్పించేట్లు గొంతు తగ్గించి.

"ఇకనేం? రెండూ కలిసొస్తాయి పెళ్లి చేసేసుకో! అతగాడికీ పెళ్లవకపోతే-"

"చాల్లే ఆపు. అవునుగానీ బాస్ చూశావా. నేను చూపించిన వేలిడ్ అబ్జక్షన్స్ అన్నీ కొట్టి పారేసి. ఆ కంట్రాక్టర్ క్లెయిమ్ ఏజీటీజీగా ఒకే చేసేశాడు. ఎంత పర్సంటేజ్ లాగేడో మరి!"

"ఛా ఊర్కో.. ఉద్యోగం పోగలదూ."

రేణుక వెళ్లాక ఆలోచనలో పడింది వింధ్య.

"ఉద్యోగం గురించి కాదు - బాస్ అవినీతి గురించీ కాదు. అతగాడ్ని పెళ్లి చేసేసుకోమని ఎంత ఈజీగా చెప్పింది!"

బావున్నాడనుకుందేగాని తనకా ఆలోచనే రాలేదు. ఎందుకు రాలేదు చెప్మా? ఎందుకంటే...

* * *

ఆ రాత్రి నిద్రలేదు. తేనె పట్టును కదలించేసింది రేణుక. తీపిజ్ఞాపకాలుగాని, మధురమైన ఆలోచనలుగాని తన జీవితానికి లేవు. తన గురించి అన్నీ తెల్సిన రేణుకే అలా అన్నదంటే-

'కామ క్రోధలోభ దంభములూ; అసూయా ఈర్ష్యా అహంకారములూ రజో గుణ ధర్మాలట- యోగము చేతనే మనస్సునందున్న రజోగుణము దూరమౌతుంది'ట-

క్రితం రోజు ఆదిత్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అతని మాటలకంటె ఆనాటి అతని రూపమే తనలో లోతుగా హత్తుకుపోయింది. తెల్లని పాలమీగడలాంటి టీషర్టూ; తెల్లని నిక్కరూ టక్ చేసి ఎంత అందంగా హుషారుగా క్లాసు తీసుకున్నాడు! తన దృష్టంతా అతని మీదే ఉంది- ఒకట్రెండు మార్లు తన చూపులో చూపు కలిపి తడబడ్డట్లుగా దృష్టి మరల్చుకున్నాడు కూడా!

ఒక వేళ అపార్థం చేసుకోలేదు గదా.

ఇక్కడ అపార్థమంటే తన మనసులోని అర్థమేనేమో!

* * *

నిద్రలేని కళ్లు మండుతున్నాయి.

చల్లని గాలికి శరీరం వశం తప్పుతోంది.

ఆకాశం మీద పక్షులు జంటలు జంటలుగా కన్పిస్తున్నాయి.

"మనస్సంటే ఏవిఁటి? డివైన్ లైట్! జ్యోతిస్సను జ్ఞానము. అది చలించి వ్యాపించి ఇంద్రియముల ద్వారా బాహ్య ప్రదేశాలకు వెళ్లి నశించుటే అజ్ఞానము. అలాంటి మనసుకు ఏకాగ్రత అవసరం'

ఆదిత్య దృష్టి తనపైనే ఉంది- తనతోనే చెబుతున్నట్లు చెబుతున్నాడు. తనూహించిన గ్రహింపు ఉందా ఈ మానవుడికి?

దృష్టి మరల్చింది-

తెచ్చి పెట్టుకున్న ఏకాగ్రత!

- ఇది త్రికోణాసనం. పిక్కలనూ తుంటి కండరాలనూ పుష్టికరం చేస్తుంది- వీపు నొప్పిని నివారిస్తుంది.

- ఇది పరివృత్త త్రికోణాసనం-వెన్నెముకలోని దోషాలను నరిచేసి మూత్ర పిండాలను చైతన్యవంతం చేస్తుంది.

- ఇది పార్శ్వకోణాసనం రొమ్ము కండరాల్ని విస్తరింపజేస్తుంది.

- ఇది పాదహస్తాసనం. వీపు నొప్పినీ; స్త్రీలలో బుతు సంబంధమైన దోషాల్నీ చక్కబరుస్తుంది-

ఒక్కొక్క ఆసనమే చేసి చూపుతూ విశదీకరిస్తున్నాడు ఆదిత్య.

క్లాసయింది-

నారాయణ మంత్రం కూడా అయింది.

ఒక్కొక్కరే వెళ్లిపోతున్నారు. కానీ తనే- ఆయన ఎదురుగా.

"మీరేం చేస్తుంటారు? ఉద్యోగమా? గృహిణీత్వమా?" అడిగేడు ఆదిత్య వింధ్య కళ్లలోకి చూస్తూ.

"అబ్బే... కాదండీ- ఉద్యోగమే." అంది తడబడి.

"మీరెందుచేతో ఈ రోజు అన్యమనస్కంగా ఉన్నారు. మీరు గమనించేరో లేదో ఆసనాలన్నీ అందరూ చేసినట్లుగా మీరు చేయలేదు- అందరూ ఎడమైతే మీరు కుడి..." నవ్వేడు.

సిగ్గుతో తలొంచుకుంది.

"ఈ ఆసనాలన్నీ శరీరాన్ని కోరుకున్న రీతిలో వంచే పద్ధతులు. మరి మనసును నిగ్రహించే పద్ధతులు కూడ మీరు చెబితే బావుంటుంది గదా'

' మనసులో అనుకున్న మాట బయటికే అనేసింది.

చిన్నగా నవ్వి; "తొందరపడితే ఎలా" అన్నాడు.

* * *

"నీ ఆలోచనలన్నీ నా గురించే అని నాకు తెల్సు వింధ్యా" సుతారంగా చేతి మీద చేయి వేశాడు ఆదిత్య.

చటుక్కున చేతిని వెనక్కు లాగేసుకుంది-

సరిగ్గా అప్పుడే మెలకువ! జాగ్రదవస్థలోని ఆలోచనే స్వప్నావస్థలోనూ-

నుదురు, మెడ చెమటతో తడిసిపోయాయి.

"ఎవరీ ఆదిత్య? ఎందుకిలా తనను వెంటాడుతున్నాడు కలల్లో కూడా!"

లేచి వెళ్ళి కిటికీ రెక్కలు తెరిచింది-

బయటంతా గుడ్డి వెన్నెల.

మేడ మీద గది కావడం వల్ల గాలి చల్లగా వచ్చి శరీరాన్ని తాకింది.

నగరం సుషుప్తావస్థలో ఉంది.

కూజాలోని నీళ్లు కాసిన్ని తాగి మంచం మీద వాలింది.

నిద్రను దూరం చేస్తూ మళ్లీ ఆలోచనలు-

"ఇంద్రియ నిగ్రహం లేనివారికి ఆత్మవిషయ జ్ఞానముండదు- అది లేనివారికి జీవితంలో శాంతి ఉండదు. యోగ నిష్ఠ చేతనే ఇంద్రియ నిగ్రహమూ మనశ్శాంతీ రెండూ కలుగుతాయి."

అవే మాటలు... అతని మాటలు-

అయినా అతని గురించి ఆలోచించేందుకైనా అదృష్టం; అర్హత ఉండాలేమో!

ఆ రెండూ ఉన్నాయా తనకు?

జ్ఞాపకాల పొరలను ఛేదించుకుంటూ వెనక్కుపోతోంది మనసు.

మాతృప్రేమంటే ఏమిటో చవి చూచేలోగానే తల్లిపోయింది- పెళ్లంటే ఏమిటో తెలియని వయసులో అన్నీ కుదిరి అయిపోతుందనుకున్న పెళ్లి పీటలమీదే ఆగిపోయింది- కట్నకాన్కల విషయంలో పెళ్లికి ముందు పెళ్లివారికిచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయాడట తండ్రి. ఏమైతేనేం? పీటల మీద పెళ్లి ఆగిపోయేంత దురదృష్టవంతురాలు తను- ఆ మచ్చ చాలు జీవితానికి.

ఓణీలు వేసే వయసు వరకూ అది తన దురదృష్టంగానే భావించింది- ఊరు మారి చదువు కోసం కాలేజీమెట్లు ఎక్కేకనే జీవితమంటే ఏమిటో తెల్సింది. అమాయకత్వం పోయి ఆత్మవిశ్వాసం పెరిగింది- విలువలన్నీ పవిత్రమైన వివాహం చుట్టూకాక డబ్బు చుట్టూ అల్లుకున్నపుడు అవి మనుషుల్ని కట్టిపడేసే తాళ్లవుతాయేమోగాని మనసులనూ జీవితాలనూ కలిపే బంధాలు మాత్రం కావు అని సరిపెట్టుకుంది.

"పాపిష్టి సంబంధం పోతేపోయింది- మరో లక్షణమైన కుర్రాడిని చూసి పెళ్లి చేసెయ్యరా నా బంగారు తల్లికి" అనేది బామ్మ. తండ్రి నిస్సహాయత, నిర్లిప్తత తనకు తెలియంది కాదు. అందుకే

"ముందు నేనొక ఉద్యోగస్థురాల్ని అవనీ బామ్మా" అనేది.

బామ్మ అందుకు వ్యతిరేకి, ఆడది మగరాయుడిలా ఉండకూడదు- అలా అని పిరికిగానూ ఉండకూడదు. ఇంటిని చక్కబెట్టుకోడంలోనూ, సంసారాన్నీ సంతానాన్నీ తీర్చిదిద్దుకోడంలోనూ స్త్రీ నేర్పుకీ చాకచక్యానికీ మించినవి లేవు- అవి మగవాడు ఆర్జించి ఇవ్వలేని విలువైన ఆస్తులు!' అనేది.

"ఇంటిపనీ... వంటపనీ... డామిట్. నాకు చేతకావు." అని తెగించి చెప్పే స్వేచ్ఛ డిగ్రీ పూర్తి చేశాకనే వచ్చింది.

అయితే ఏం లాభం?

ఉద్యోగం, డబ్బు, స్వేచ్ఛ.... అన్నీ ఉన్నా వీటిని మించిన ఒంటరితనాన్ని ఛేదించాలంటే ఇప్పుడు డబ్బొక్కటే చాలదు. గతాల్ని తవ్వుకోవాలి... జాతకాల్ని సరిజూసుకోవాలి... అందచందాల్ని లెక్కగట్టాలి... ఇంకా ఎన్నో!

"అవన్నీ కుదిరేవి కావులే" అంటూ నిద్ర జోలపాడింది.

* * *

నాలుగు రోజులు... కావాలనే... అతని ధ్యాస నుండి విడివడాలనే క్లాసులకు వెళ్లలేదు. అయిదో రోజు క్లాసు అయ్యేక నెమ్మదిగా జారుకుంటూంటే పిలిచాడు ఆదిత్య.

"మీరెంచేతనో రెగ్యులర్‌గా రావటం లేదు." అన్నాడు.

"ఇదేం చిన్నపిల్లల రెండో తరగతి క్లాసు కాదు- నా ఇష్టం-" అనాలనుకుంది.

"దానిక్కారణం మీరే" అని చెప్పాలనుకుంది.

కానీ అంత కఠినంగానూ అంత చొరవగానూ చెప్పడానికి నోరు రాలేదు-

"పెళ్లి చూపులు- మా ఊరెళ్లాను" అంది.


గతుక్కుమన్నాడతడు.

"ఏ ఊరూ?"

అన్ని వివరాలూ చెప్పాలి కాబోలు! మగ బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు.

చెప్పింది-

"మరి ఈ ఊళ్లో....."



**అసలు విషయం**

"గొప్ప అందగత్తెవి కాదు. చదువుకున్నదానివి కాదు. మీ ఆయన నిన్ను కానీ కట్నంలేకుండా పెళ్లి చేసుకున్నాడా. ఏం మంత్రం వేశావు? అడిగింది పద్మ, ఫ్రెండుని.

"పెళ్లి అయ్యాక వంట వండటం, బట్టలుతకటం, అంట్లు తోమటం అన్నీ నేనే చేస్తానని ప్రామిస్ చేశాను." కళ్లు తిప్పుతూ అసలు విషయం చెప్పింది ఫ్రెండు.

**- పి. సరోజ** (అమలాపురం)

"ఒక్కదాన్నే. ఉద్యోగికి దూరభూమి లేదు గదా"

మరేం మాట్లాడలేదు-

పాపం! నిజం చెప్పేస్తే గురుడు ఎంతలా రియాక్టయ్యేవాడో!

ఆ మరుసటి ఆదివారం సాయంకాలం-

పిల్లగాలులు కెరటాలు కెరటాలుగా వీచే వేళ...

కెరటాలు నురుగలు నురుగులుగా భూమినంటుకునే వేళ... సముద్రమూ నీలాకాశమూ కల్సి కనుచూపు మేరలో తమాషాగా కబుర్లాడుకునే వేళ..... నీలాకాశంలోని చుక్కల్లా నీలి సముద్రంలో ఓడల దీపాలు కాంతులు పుంజుకునే వేళ- మెత్తని ఇసుక తిన్నె మీద వింధ్యకు ఎదురయ్యాడు ఆదిత్య.

"ఎలా? ఇక ఎలా!" అనుకునేలోగా అతనే పలకరింపుగా నవ్వేడు- తెల్లని పైజామా; లాల్చీ- వెనుక ఇద్దరు పిల్లలూ-

ఏదో సంశయం. చుట్టూ చూసింది. ఎవరూ లేదు-

"ఒక్కరే వచ్చారా?" అడిగాడు.

"ఫ్రెండు రావాలి" అంది రోడ్డు వంక చూస్తూ-

"ఎలా ఉంటోంది మీకు యోగా? మీ ప్రాబ్లెమ్స్ ఏవైనా సాల్వ్ అవుతున్నట్లు కనిపిస్తున్నాయా?"

చెప్పింది-

ఆ తర్వాత పొడిపొడిగా ఏవో మాటలు.

"ఈ పిల్లలూ..." అడిగింది చివరికి.

"మా పిల్లలే. మాస్కూలు పిల్లలు..... ఉద్దండులు" అంటూ నవ్వేశాడు.

ఆకాశంలో తెల్లమబ్బొకటి విడి, తేలిపోయింది.

"కాస్సేపు కూర్చుందాం" అంటూ ఇసుకలో కూర్చున్నాడు తనూ కూర్చుని, నెమ్మదిగా వ్యక్తిగత వివరాల్లోకి సంభాషణ మళ్లించింది-

పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి కొన్నాళ్లు నిరుద్యోగిగా గడిపేక తన వంటి కొందరు పోస్టు గ్రాడ్యుయేట్ల సహకారంతో ఒక మోడల్ స్కూల్‌ని స్థాపించాడట-

"స్కూలే లోకం- పిల్లలే ప్రపంచం... యోగాయే సర్వస్వం. నా ఒంటరి జీవితానికి అవేతోడు" అన్నాడు చివరిగా.

* * *

యోగనిద్ర... రిలాక్సేషన్!

శరీరాన్నీ, మనసునీ, ఎమోషన్స్‌నీ ఒకే మారు రిలాక్స్‌డ్‌గా ఉంచే ఏకైక సాధన. దీనికి మనోనిశ్చయం, దృఢ సంకల్పం అవసరం- శరీరాన్ని అచేతనంగా ఉంచి మనసుని మనోహరంగా విహరింపజేసే నిద్రకాని నిద్ర. బాహ్యచక్షువులు మూసి మనోనేత్రంతో శరీరాన్నీ, ప్రకృతిలోని అందాల్నీ దర్శించే యోగనిద్ర!"

ఆదిత్య మాటలు లయాన్వితంగా గాల్లో తేలి వస్తూ వినిపిస్తున్నాయి-

మనసు సూర్యోదయాల్నీ హిమాలయాల్నీ, జలపాతాల్నీ నదీ ప్రవాహాల్నీ సముద్ర తీరాల్నీ దర్శించుకుంటూ పోతోంది- పూలవనాల్లో ఆకుపచ్చని పచ్చిక బయళ్లలో పుష్పసుగంధాన్ని ఆస్వాదిస్తూ విహరిస్తోంది- శరీరం తేలికై ఆకాశంలో

తేలుతూ కేరింతలాడుతోంది- అనుభూతిస్తోంది-

అంతలో- ఆదిత్య... తన అడుగులో అడుగుగా- అంతకుముందు ఆ పరిసరాలూ ఆ ప్రకృతి రామణీయక స్థలాలూ దర్శించిన వానిలా ఒక్కొక్కదాన్ని వర్ణిస్తున్నాడు- ప్రకృతిలో లీనమయ్యే ఆ క్షణాన మనసంతా తానే అయి నిండిపోయాడు.

అలవోకగా అతని ఒడిలో ఒదిగిపోయింది...

అలసిన మనసుకు ఓదార్పు... ఎన్ని క్షణాలు అలా గడిపిందో! సుకుమార కరస్పర్శ... సున్నితంగా తట్టాడతను-

నెమ్మదిగా కనులు విప్పింది-

"యోగనిద్రలోంచి నిజనిద్రలోకి వెళ్లిపోయారు వింధ్యగారు"

ఎదురుగా నవ్వుతూ ఆదిత్య!

సిగ్గుపడిపోయింది.

ఆకాశమంతటా పల్చని మబ్బులు- వాతావరణంలో చిరుచలి! పరచిన మెత్తటి కార్పెట్ మీద పద్మాసనంలో ఆదిత్య ఒక్కడూ- మెడిటేషన్‌లో ఉన్నట్లుంది.

నెమ్మదిగా వెళ్లి ఎదురుగా కూర్చుంది వింధ్య. మిగిలిన వాళ్లేమయ్యారో ఇవాళ? అంతా కట్టకట్టుకుని ఒక్కసారే...

"ఏవిటీ మీరొక్కరే వచ్చారా?" అలికిడికి కళ్లు తెరచి అడిగేడు ఆదిత్య.

అవునన్నట్లుగా తలూపి; "మరి వీళ్లంతా..." అంటూ ఆగింది.

నవ్వి; "ఈ రోజు శ్రీరామనవమి కదా! నిన్న క్లాస్ అయ్యాక చాలా మంది సెలవుకావాలన్నారు. మీలాంటి ఒకరిద్దరు అప్పటికే వెళ్లిపోయారులా ఉంది." అన్నాడు.

"అయ్యో! సెలవిచ్చేశారా? ఎంత గొప్ప ఛాన్సు మిస్సయిపోయాను"

"ఏవిటో అది?"

"అలారం బాధలేకుండా ఏడున్నర వరకూ పడుకోవడం" అనేసి నాలిక్కరుచుకుంది.

నవ్వేశాడతను-

"మరి.. మీరొక్కరూ ఇలా..." అడిగింది.

"అలవాటైపోయింది. ఎక్కడైనా చేసేదేగా. ప్రశాంతంగా ఉంటుందని ఇక్కడికే వచ్చేశాను." అన్నాడు.

"సమయం చూసి పేల్చేయ్. వనిత తనంతతా వలచి వచ్చిన... అంతటి ప్రవరాఖ్యుడనుకోను-"

రేణుక సలహా మదిని దొలిచేస్తోంది-

ఇంతకంటే మంచి సమయం మళ్లీ దొరుకుతుందా?


ఆకాశం మీంచి చిరుజల్లు మంచులా రాల్తోంది.

లేచి, మంటపంలో కూర్చున్నారిద్దరూ.

"శ్రీరామనవమికి చిరుజల్లయినా తప్పకుండా పడుతుందట. భద్రాచలంలో అయితే కల్యాణ ఘడియకు తప్పదట."

"అవునా?" అన్నట్లు అతనివంక చూసింది-

చిరుజల్లు ఆగి తూర్పున వెలుగురేకలు విచ్చుకున్నాయి.



## కదిలే శివలింగాలు

పంజాబ్ రాష్ట్రంలోని పఠాన్ కోట పట్టణానికి కొద్ది దూరంలో ఉన్న కాల్‌గర్ అనే గ్రామంలో రాతితో మలచిన రెండు శివ లింగాలు రోజు రోజుకు కొద్దికొద్దిగా కదలుతూ వచ్చి ఒక్కదాన్నొకటి తాకుతాయి. భూమిలో లోతుగా పాతి ఉన్న ఈ శివ లింగాలు ఏటా శివరాత్రి నాటికి కలవటం అద్భుతం. ఈ దేవాలయం పర్వత శిఖరంపై ఉంది.

- కలపర్తి సత్యం (ఏలూరు)

"చాల రోజులుగా మిమ్మల్ని ఓ ప్రశ్న అడగాలనుకుంటున్నాను. వ్యక్తిగతమైంది." అంది ఎలా మొదలు పెట్టాలో తెలియక.

అతను నవ్వి వింధ్య ముఖంలోకి చూశాడు,

కాంతిగా మెరిసే కళ్లు ... సిగ్గుతో ఎర్రబడ్డ చెక్కిళ్లు ... ఫాలభాగాన అల్లరల్లరిగా కదిలే ముంగురులూ ... తీర్చి దిద్దిన కనుబొమలమధ్య చిన్న బొట్టు - అందం, ఆకర్షణ సమపాళ్లలో కలిసి ఉన్నాయా అన్పించింది ఆ సుప్రభాత సమయాన.

నెమ్మదిగా మనసులోని మాటను బయట పెట్టింది వింధ్య.

"నేనూహించాను. మన మధ్య ఇటువంటి సమయం వస్తుందని - అందుకే నా జవాబును సిద్ధంగా ఉంచాను" అన్నాడు

ఆశ్చర్యంగా చూసింది అతని వంక.

"అవును. ఈ ఒంటరి బ్రతుకులోకి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానించగలను వింధ్యా" అన్నాడు.

దగ్గర చేసుకునే ఏకవచన ప్రయోగం! మనసులో వేయి వీణియలు పలికినట్టయ్యాయి వింధ్యకు.

ఇది నిజమా? కలో యోగమాయో కాదు గదా?

నెమ్మదిగా వింధ్య చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు ఆదిత్య.

గుడిలో గంటలు మోగాయి.

గుళ్లో దండలు మార్చుకుని గుమ్మంలోకి అడుగు పెట్టిన కూతుర్నీ అల్లుడినీ చూసి ఆనందంతో కంట తడి పెట్టాడు వింధ్య తండ్రి.

"నా బంగారు తల్లి జీవితంలో వెలుగును నింపేవు. నీ ఋణం తీర్చుకోలేనిది నాయనా! కలకాలం సుఖంగా ఉండండి" అంటూ దీవించేడు.

"మీ జీవితం మూడు ఆసనాలు గానూ ఆరు ఎక్సర్‌సైజులు గానూ వర్ధిల్లాలి" అంటూ గుమ్మం దగ్గర హారతిచ్చిను "మీ ఆయన పేరు చెప్పి కుడి కాలు ముందుకు వేసి రావాలే వింధ్యా" అని ఛలోక్తి విసిరింది రేణుక.

వింధ్య సిగ్గుపడలేదు.

"అన్నదానపు ఆదిత్య శంకర్" అంటూ పూర్తి పేరు అందరికీ వినబడేలా చెప్పింది.

"మీరూ మీ ఆవిడ పేరు చెప్పాలి మరి" అంటూ ఆదిత్య వంక చూసింది రేణుక.

"వింధ్యాచల వాసిని" అన్నాడు ఆదిత్య చిర్నవ్వుతో.

నవ్వుల గలగలలతో ఇల్లు మార్మోగింది.

"బాబూ .... అన్నదానపు వారంటే ... మీది ఏవూరు?" లోపలి కొచ్చాక అనుమానంగా అడిగేడు వింధ్య తండ్రి అల్లుడిని.

ఊరి పేరు చెప్పి; "నేను జగన్నాథం గారి అబ్బాయిని ఆయన కాలం చేసి అయిదేళ్లయింది' ' అంటూ వివరాలు చెప్పేడు ఆదిత్య.

అంతే! ముసలాయన ముఖంలో రంగులు మారాయి. అది గ్రహించిన ఆదిత్య "సందేహం లేదు మావయ్య గారూ! నేను ఒకప్పుడు మీకు కావాల్సిన అల్లుడినే - అప్పుడు తప్పినా ఇప్పుడు తప్పలేదు. వింధ్యను చూసినప్పుడే నేను గుర్తించాను" అన్నాడు నవ్వుతూ.

నోరు వెళ్లబెట్టి నమ్మలేనట్టు ఆశ్చర్యంగా అతని వంక చూసింది వింధ్య. ఔనన్నట్లు కళ్లతోనే జవాబు చెప్పేడు ఆదిత్య.

ఆమె కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగాయి. మనులోని ఉద్వేగం, ఎన్నో సంవత్సరాలుగా ఘనీభవించిన బాధ; వ్యధ కట్టలు తెంచుకుని బయట పడ్డాయి కన్నీళ్ల రూపంలో -

కాస్సేపటికి మబ్బులు తొలగిన ఆకాశంలా తెప్పరిల్లింది.

అప్లికేషన్ ఇచ్చిననాడే అర్థమైపోయిందన్న మాట! అందుకేనేమో తను పెళ్లిచూపులని అబద్ధం చెప్పినప్పుడు గతుక్కుమన్నది! "శాశ్వత నిర్ణయాలు తొందరపాటువి కాకూడదు - మీరు నా గతం గురించి కూడా తెల్సుకోవాల్సింది ఉంది' అని అన్ననాడూ దాటవేసిందిందుకేనా?

కళ్లు తుడుచుకుని, ఆనందంగా అతని వంక చూసి;

"ఓ మారు లోపలికి రండి" అంటూ ఆదిత్య చేయి పట్టుకుని లోపలకు తీసుకు వెళ్లింది.

"చూశావా బామ్మా. యోగం అంటే ఇదీ! యోగమంటూ ఉంటే పీటల మీద పెళ్లి ఆగిపోయినా ఆనాడు తాళి కట్టాల్సిన వాడే ఏనాటికైనా జీవిత భాగస్వామి అవుతాడు. మరి నన్నిలా చూసే యోగం నీకే లేదు." అంటూ బామ్మ ఫోటో ముందు నిల్చుని ఆనందంగా కన్నీళ్లు పెట్టుకుంది వింధ్య.

●